
# దంతెవాగు

- దానం శివప్రసాదరావు



**దామోదర్‌కు ఊహించని సదవకాశం వచ్చేసింది. ఏనాడో ఉన్న మంచి పొలాలు, స్థలాలు, ఇల్లు అమ్మేసుకుని, ఎవ్వరూ కొనేందుకు ముందుకు రాని కారణంగా "అదే పడి ఉంటుందిలే"అని ఉంచుకున్న తన పల్లెలోని 'బీడు' 18 ఎకరాలకు మహా డిమాండ్ వచ్చింది. ఆనాటి రోజుల్లో పశువులు మేపుకునే 'బీళ్ళు'. ఊళ్ళో మోతుబర్లు తామే కాబట్టి చవగ్గా ఆనాడు 'బీడు' భూమిని కొన్నారు.**

తను ఊరొదిలి దశాబ్దాలు గడిచాయ్. పద్దెనిమిదెకరాల ఒకే పంపు క్రింద ఉన్న భూమి కోటి రూపాయలు పలుకుతోంది ఇప్పుడు. అమ్మవల్సిన అగత్యమేమీ లేదు.

కానీ ఇంత మంచి రేటు ముందు ముందు రాదేమో? దగ్గినా, తుమ్మినా- సెన్సెక్స్ పడిపోతూ, లేచేటట్లు ఈ భూముల రేట్లు ఎప్పుడెలా ఉంటాయో తెలీని పరిస్థితి.

వేర్పాటువాదాలు, రింగురోడ్లు, కొత్త ఎయిర్ పోర్టులు, బహుళజాతి కంపెనీల ఫ్యాక్టరీలు క్రొత్త ఫిల్మ్ సిటీలంటూ భూములు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయ్.

ఎవరెప్పుడు కోటీశ్వరులవుతారో, బికారులవుతారో తెలీని మహా జూదం. ఈ నేపథ్యంలో డాక్యుమెంట్ల మాయాజాలం. పాత వాటిస్థానే క్రొత్త డాక్యుమెంట్లు పుట్టుకొస్తున్నాయి. ఇక ఆపై కోర్టులు, పంచాయితీలు.

"ఏదో రేటు కూడా బాగానే వచ్చింది. అమ్మేస్తే పోలా?" జానకి కూడా తన ఆలోచనకు ఊతమిచ్చింది.

"ఎందుకు డాడ్? ఇంకా అక్కడ! ఎప్పుడో చెప్పాగా! అమ్మేసెయ్‌మని" హరీష్ అన్నాడు తల్లికి సపోర్టిస్తూ. అమెరికాలో స్థిరపడిపోయిన హరీష్ ఇండియా వచ్చి పది రోజులు దాటింది.

'ఇంకా ఇక్కడ బెంగుళూర్‌లో, ఈ వయసులో ఇంకా కష్టపడుతూ బిజినెస్ చేయడమెందుకు? విశ్రాంతిగా ఉండక!' అంటాడు హరీష్.

ఈ డబ్బు 'భాను' పిల్లల పేరుమీద వేద్దాం అంది జానకి. అల్లుడు భాస్కర్ హైదరాబాద్‌లో డాక్టర్.

హరీష్ ఈ డబ్బులో వాటా వద్దన్నాడు. అమెరికాలో మంచి సంపాదన. భార్య భర్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్.

'హైదరాబాద్ అమ్మాయి దగ్గరకు వెళ్ళిపోదాం. ఇంకా ఎందుకు ఈ బిజినెస్‌లు మనకు. ఉన్నది చాలదా!' జానకి పోరుతున్నా దామోదర్‌కు ఇష్టం లేదు.

'శరీరంలో సత్తువ. తిరిగే శక్తి ఉన్నంతవరకు ఖాళీగా కూర్చోకూడదు. శక్తి ఉడిగినప్పుడు హైదరాబాదో, అమెరికానో అప్పుడు చూద్దాం!' అంటాడు దామోదర్.

డెబ్భైయ్యో పడిలో పడుతున్నా దామోదర్‌లో 'వడి'తగ్గలేదు. పైసా అంటే ప్రాణం.

రూపాయంటే వంద రూపాయలతో సమానం. తన దగ్గర పనిచేసే సిబ్బంది కూడా తనను 'పిసినారి'గా అభివర్ణించడం కద్దు.

అప్పుడప్పుడు జానకి కూడా తన పిసినారి తనానికి చురకలు వెయ్యడం జరుగుతూనే ఉంటుంది. రూపాయి విలువ మీకేం తెల్సు! పల్లెటూరినుంచి వచ్చినవాణ్ణి. కష్టపడి పైకొచ్చిన వాణ్ణి! దర్పంగా అంటాడు దామోదర్.

ఆలయాలకు, అన్న సంతర్పణలకు, వృద్ధాశ్రమాలకు 'మరికాస్త ఇస్తే ఏం పోతుందిట!' చెప్తుతుంది జానకి.

గత రెణ్ణెల్లనుంచి తన ఊరి 'దశరథ రామయ్య' తనకు ఫోన్లుచేస్తూనే ఉన్నాడు. మంచి అవకాశాలు వచ్చాయని. దశరథ రామయ్య తన బాల్యమిత్రుడు.

తనూ నిర్ణయించుకున్నాడు. హైదరాబాద్‌కు ఫ్లైట్‌లో వచ్చిన దామోదర్ అల్లుణ్ణి, కూతురును, పిల్లలను పలకరించి ఓ పూట ఉండి, కారులో బైల్దేరాడు గుంటూరు జిల్లాకు. కూతురు భాను, కొడుకు హరీష్‌తో. పల్లెను చూద్దామన్న సరదా భానుకు, హరీష్‌కు ఉంది.

తన పల్లెకు దగ్గర్లో ఉన్న టౌన్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్. అందుకు తగిన ఏర్పాట్లన్నీ దశరథ రామయ్య చేశాడు. రిజిస్ట్రేషన్‌కు తన కొడుకు, కూతురు సంతకాలు కూడా అవసరం అవడంతో ముగ్గురూ పల్లెకు బైల్దేరారు.

హైదరాబాద్-గుంటూరు రోడ్డులో పిడుగురాళ్ళ టౌన్‌నుంచి లోపలికి వెళ్ళాలి. తన పల్లె చేరాలంటే. మట్టిరోడ్డులో పదిహేను కిలోమీటర్లు ప్రయాణించాలి. మట్టిరోడ్డులోకి వచ్చింది కారు.

ఫ్రంట్ సీట్లో ఉన్న దామోదర్ ముఖం ఒక్కసారిగా వివర్ణమైపోయింది. గుండెల్లో ఏదో తెలీని బాధ. గుండె చప్పుడు తనకు స్పష్టంగా వినపడసాగింది. శరీరం కంపనాలకు గురవుతున్నట్లుగా తయారైంది. గొంతు తడారిపోసాగింది. 'వాటర్' అని అడిగాడు.

భాను వాటర్‌బాటిల్ అందించింది.

పరిసరాలను మర్చిపోయాడు. ఇంకేవీ కళ్ళకు గోచరం కావడంలేదు. సమయం సాయంత్రం నాలుగ్గంటలు కావొస్తోంది.

అప్రయత్నంగా దామోదర్ పెదవులు శ్యామల...శ్యామల...శ్యామల పేరును ఉచ్ఛరించడం మొదలెట్టాయి.

వెనుక సీట్లో హరీష్, భానులు ముచ్చట్లల్లో పడ్డారు. గతుకుల రోడ్డుమీద పరుగులు తీస్తోంది కారు.

ఈ రాత్రికి దశరథ రామయ్య ఆతిథ్యం తీస్కోవడం. ఉదయాన్నే భూమి కొనుగోలుదార్లతో పిడుగురాళ్ళ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ పని చూస్కొని- సిటీకి వెళ్ళిపోవడం, అదీ నిర్ణయించుకున్న ప్రణాళిక.

⁂

పల్లెలో పెద్దబజార్లోని దశరథ రామయ్య ఇంట్లో ఆతిథ్యం. ఎంతో ఆదరంగా చూశారు. ఊరు ఊరంతా వచ్చి 'దామోదరం బాబూ' అంటూ ఆత్మీయంగా పలకరించింది.

సరిగ్గా నలభై ఏళ్ళు దాటాయి ఊరు విడిచిపెట్టి. ఓ ఐదొందల గడప ఉండే ఊరు తనది.

సాయంత్రం ఆరుగంటలవేళ గ్రామానికి ఉత్తరంగా ఉండే తమ భూముల దగ్గరకు బైల్దేరారు. ఊరును ఆనుకునే వాగు. వాగు దాటితే దామోదర్ పొలాలే.

"కొలతలు రేపు" అన్నాడు దశరథ రామయ్య.

"కాసేపలా వెళ్ళొద్దాం పద!" వారి వెంటే భాను, హరీష్‌లు కూడా బైల్దేరారు.

'అప్పటికీ ఇప్పటికీ ఊరు పెద్దగా మారిపోయిందేమీ లేదు."

“మరి! పల్లెల్లో ఏముంది? అభివృద్ధి?” పట్నాలకు పోవడమే.

మట్టిరోడ్లు... ఇరుకు సందులు, గొందులు, అరుగులు... మట్టి మిద్దెలు.

‘కనీసం సిమెంటు రోడ్డైనా వెయ్యలేదే.’

ఊళ్ళోవాళ్ళు దామోదర్‌ను, హరీష్ భానులను క్రొత్తగా వింతగా చూస్తున్నారు. గుర్తుపట్టినవాళ్ళు దామోదర్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్నారు.

పిల్లలను పరిచయంచేస్తూ వారెక్కడుండేదీ, ఏంచేస్తుండేదీ చెప్తున్నాడు.

పెద్దబజారు దాటి, ఓ సందు దాటగానే ఊరి పొలిమేరలు వచ్చాయి. ఊరుముందు వాగు... వాగు. అటు దరి... ఇటు దరి... వెడల్పుగా ఉంది వాగు బెడ్‌పోర్షన్. రోడ్డును కొంచెం ఎత్తు లేపారల్లె ఉంది. ఆరు పెద్ద దోనెల గుండా నీరు నిమ్మళంగా ప్రవహిస్తోంది.

వడ్డున నిలబడిపోయాడు క్షణకాలం దామోదర్.

ఈ వాగే శ్యామలను, తన తండ్రిని పొట్టన పెట్టుకుంది. నల్లమల కొండల్లోని నీరుకూడా అంతర్వాహినిగా ప్రవహిస్తూ ఆ వాగులో కలుస్తాయి.

మనస్సు వికలమై పోయింది దామోదర్‌కి.

“దశరథం” రేపు బీడులోకి వెళ్దాంలే! చీకటి పడ్తోంది ఇంటికి పోదాం పద” అన్నాడు.

భోజనాలు అయ్యేసరికి రాత్రి తొమ్మిదైంది. పల్లె భోజనం జిహ్వ చాపల్యాన్ని పోగొట్టింది.

ఏనాడో పల్లెలోని తన ఇంటిని కొన్న శేషిరెడ్డి వచ్చి పలకరించి, కుశల ప్రశ్నలువేసి వెళ్ళిపోయాడు.

ఎందుకో దామోదర్‌కు తన ‘స్వంత ఇల్లు’ ఉన్న బజారుకు వెళ్ళాలనిపించలేదు.

మనస్సు నిండా ఆలోచన్లు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇన్నాళ్ళూ పెద్దగా గుర్తుకురాని గతం అదే పనిగా తడుముతోంది బాధ. ఏదో తెలీని అనుబంధం. తెలీంది కాదు అది. చివురులోనే త్రుంచివేయబడిన గాఢమైన బంధం.

ఎవరో గుండెను పిండుతూన్నట్టుగా ఉంది.

ఆ సరికే పల్లె నిద్రించింది. వసారాలో పట్టె మంచం, పరుపు దామోదర్‌కు వేయబడ్డాయి. ఎంతకూ నిద్ర రాదు.

శ్యామల మనస్సంతా నిండిపోయింది.

ఉరకలేసే నీటి ప్రవాహంలా గతం గుర్తుకొస్తోంది.

వాగు... దంతెవాగు... ప్రవాహం. నీటిసుడులు... ఓ భయానక దృశ్యం. మూడ్రోజులుగా వాన ముసురు. ఊరు ఊరంతా నీళ్ళల్లో నానిపోతోంది. తడిసి ముద్దగా మారిపోయింది.

గోడలు, మిద్దెలు నీటిని కక్కుతున్నాయి. కొట్టంలో పశువులు మేత లేకుండా పడి ఉన్నాయ్. ఊళ్ళో మిద్దెలు, పశువుల కొట్టాలు కొన్ని కూలిపోయాయి.

రాత్రి సమయం. ఊరు ముందున్న “దంతెవాగు పొంగి పరవాళ్ళు తొక్కుతోంది. ఉత్తరం వైపున బజార్లలోకి వాగు నీరు వచ్చేసింది. ఇంకా వర్షం పడ్తూనే ఉంది. చివరి బజార్లలో అరుపులు-కేకలు.

మరి కాసేపట్లో క్రింది బజార్లలోని జనం తట్టలతో, బుట్టలతో, రేకు పెట్టెలతో పెద్దబజార్లోకి పరుగులు తీస్తూ వచ్చారు.

ఆడవాళ్ళు, పిల్లలు, వృద్ధులు. అంతా హడావిడి పరుగులు గందరగోళం.

పోతేపల్లి, తేరాల, ఆత్మకూరు పెద్దచెరువులు తెగాయట. దంతెవాగు ఊరుమీద పడ్తోంది. మీరుకూడా రండి! బోడు మీదకు పోదాం. కేకలు! అంతటా భయం! భయం!

చిమ్మచీకటి... వర్షం... చూస్తూండగానే ప్రవాహం ఊరును చుట్టేసింది. పెద్దబజార్లోనూ నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

ఇళ్ళల్లోని వారందరూ మిద్దెలపైకి ఎక్కారు. గొడుగులు- పట్టలు కప్పుకుంటూ ప్రవాహమట్టం నిముష నిముషానికి పెరుగుతోంది.

గడ్డివాములు, కంప, చెట్లు, పశువులు కళ్ళముందే నీటిలో తేలియాడుతూ కొట్టుకుంటూ పోతున్నాయి.



**ఎటుచూసినా ప్రవాహపు ఉరవడి. చీకటి. మిద్దె దిగేందుకు వీల్లేదు. భార్య శ్యామల, తండ్రి పరశురామయ్య మరి తనను పిలవలేదు. కేకలు విన్పించలేదు. ఆ రాత్రంతా భయానక దృశ్యాలే.**

ఎప్పుడో 1960లో వచ్చిందట? ఇంతటి ఉప్పెన?

పరశురామయ్య పెద్దగా కేకేసాడు.

‘అరేయ్ దామోదరం? ముందు అమ్మను, అమ్మాయిని మిద్దెపైకి చేర్చు! నేను వస్తాను’ ఆ గొంతులో ప్రాణభీతి. తడి ఆరిపోయింది గొంతుక.

“నువ్వు వెళ్ళు నాన్నా! నేను వస్తాను.”

“కాదు లేరా? బీరువాలో కాయితాలు-గట్రా” ఉన్నాయి. నువ్వెళ్ళుముందు.” ఆసరికే నీళ్ళు ఇంట్లోకి మోకాళ్ళ లోతులో ఉన్నాయి. బ్యాటరీ లైటుకాంతితో ఇంటి పెరడులోని మెట్లు ఎక్కించేసాడు ఆడవాళ్ళు ఇద్దర్నీ దామోదరం.

దామోదరానికి పెళ్ళయ్యి సరిగ్గా నెల. భార్య శ్యామలను, తల్లిని మిద్దెపైకి చేర్చాడు.

మహోధృతంగా, ఊరిని తుడిచిపెట్టే విధంగా వరద వచ్చేసింది. చివరి పై మెట్టు కుప్పలా మెట్లన్నింటినీ కలుపుకొని కూలిపోయింది.

ఇంటి గదుల్లో తండ్రి. కేకలు పెట్టాడు దామోదరం.

పై మిద్దె ఓవైపు చప్పుడుచేస్తూ కూలిపోయింది. నిలద్రొక్కుకోలేక శ్యామల పడిపోయింది. పిచ్చివాడై పోయాడు దామోదరం.

ఎటుచూసినా ప్రవాహపు ఉరవడి. చీకటి. మిద్దె దిగేందుకు వీల్లేదు. భార్య శ్యామల, తండ్రి పరశురామయ్య మరి తనను పిలవలేదు. కేకలు విన్పించలేదు. ఆ రాత్రంతా భయానక దృశ్యాలే.

పాతికేళ్ళ దామోదరం తల్లిని పొదివి పుచ్చుకుని రాత్రంతా అలానే గడిపాడు. ఆ మరుసటి రోజు తెల్లవారుఝాముకు వరద తగ్గుముఖం పట్టింది.

భార్య, తండ్రి శవాలు కూలిన గోడల క్రింద పెరట్లో.

ఈ బీభత్స దృశ్యం, హృదయాన్ని నిలువునా కోసివేసిన, వేదనాపూరిత అనుభవం ఐదేళ్ళపాటు అతలాకుతలం చేసింది.

ఆ సంఘటన తర్వాత ఈ 18 ఎకరాల బీడు మినహా మిగతా పొలం, స్థలాలు, పశువులకొట్టాలు ఐనకాడికి అమ్మేసి పట్నం చేరాడు తల్లితో దామోదరం...

అటుపై తల్లి బలవంతంతో ‘జానకి’తో వివాహం. కాలంతో మార్పు, గమనం సహనం. పిల్లలు హరీష్, భానుల చదువులు - తన వ్యాపారాభివృద్ధి. బెంగుళూర్‌లో స్థిరపడటం జరిగిపోయాయి.

ఆ రాత్రి నిద్రే పట్టలేదు. శ్యామల రూపం, తన తండ్రి తన చేతికి డాక్యుమెంట్లు, డబ్బు, నగల బ్యాగ్ నిస్తూ - నువ్వు ముందు ‘మిద్దె’ మీదకు పద- అమ్మ-అమ్మాయ్ జాగ్రత్త! ఆ మాటలు, వారి రూపాలే మనస్సు నిండా. తొలి కోడి కూశాక ఎప్పటికో కాస్తంత కలత నిద్ర పట్టింది.

మరుసటిరోజు సాయంత్రానికల్లా రిజిస్ట్రేషన్-సంతకాలు గట్రా పూర్తయ్యాయి. క్యాష్‌బ్యాగ్ బరువుగా అందింది. హరీష్ చేతుల్లో ఉంది.

‘దశరథం’ ఇలారా! చెప్పు ఇంకా ఆ దంతెవాగు ఇబ్బంది తొలగింది కదూ? అలానే ఉందా?

ఏం చెయ్యమంటార్ దామోదరం? అధికార్లకు, నాయకులకు అర్జీలు పెడ్తూనే ఉన్నాం. అవిగో బడ్జెట్ కేటాయిస్తున్నాం అంటారు ఒకసారి. అరె! మంజూరైన నిధులు వేరేవాటికి డైవర్ట్ అయ్యాయి అంటారు మరోసారి. నాయకుల మాటలు, అధికారుల జిమ్మిక్కులు నీకు తెలీందేముంది చెప్పు! ‘సరేలే! పొద్దుపోతోంది. బైల్దేరండి. క్యాష్ జాగ్రత్త’ దూరం ప్రయాణం తొందర పెట్టాడు దశరథం.

‘చూడు దశరథం నేను ఈ పూట కూడా మనూర్లోనే ఉంటాను. ఓ పని చేద్దాం.

దంతెవాగు మీద బ్రిడ్జి నిర్మాణం, అలానే మన ఊరికి ఉత్తరం వైపున కరకట్ట, రివిట్‌మెంట్ నిర్మాణం జరిగాయంటే ఊరికి భయంలేకుండా వరద ప్రమాదం లేకుండా ఉంటుంది.

‘ఇది’ రేపు నీ పేరున ఇక్కడే బ్యాంక్‌లో ఎకౌంట్ ఓపెన్ చేయిస్తాను. ఈ కోటి రూపాయలకు మరి కొంత గవర్నమెంటు మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తుంది.

ఈ కార్యక్రమాన్ని నువ్వే మొదలెట్టాలి. ఎవరెవర్ని కలవాలో, ఏయే నాయకుల, అధికారులను కల్సి, గ్రామంలోని వారిని కల్పుకుంటూ ప్రణాళికలను నువ్వే తయారుచెయ్యాలి.

‘ఇది’పల్లె డబ్బు. నగరాల్లో, ఐరన్ సేఫ్‌ల్లో... లాకర్లల్లో మూలగ్గూడదు. పల్లెకే ఉపయోగపడాలి.

ఆశ్చర్యపోవడం ‘దశరథం’వంతైంది. ఊర్లో పెద్దలతో ఓ కమిటీని ఈ మొత్తానికి ఓ ట్రస్టీని ఏర్పరుచుకో.

నీ పర్యవేక్షణలో ఈ సౌకర్యాన్ని మన ఊరికి కల్గించు. ఊరికి మేలుచేసిన వాడివవుతావ్. దామోదర్ చెప్పుకుంటూ పోతున్నాడు.

హరీష్, భానులు కూడా ఔనన్నట్లుగా. సంతృప్తిగా తమ ఆమోదాన్ని తెలియచెప్పారు.

మరలా కారు పల్లెకేసి బైల్దేరింది.

దామోదర్ హృదయం తృప్తితో నిండిపోయింది ఇప్పుడు. ★

**రచయిత చిరునామా :-**
దానం శివప్రసాదరావు,
ఇం.నెం.15-2-132/1, గాయత్రీనగర్, ఫస్ట్‌క్రాస్‌రోడ్,
మాచర్ల- 522426. గుంటూరు